క్లుప్తంగా

నేడు కల్తీ మద్యంపై నిరసన

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గం ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ సోమవారం కల్తీ మద్యం నివారించాలని కోరుతూ పట్టణంలో నిరసన కార్యక్రమం జరుగుతుందని నియోజకవర్గ కార్యాలయ సిబ్బంది ఆదివారం తెలిపారు. ఉదయం పది గంటలకు పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి బయలుదేరి ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సు. దీర్‌భార్గవరెడ్డి పాల్గొంటారని, పార్టీ అనుబంధ విభాగాల బాధ్యులు, ప్రజాప్రతినిధులు, మహిళలు, శ్రేణులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

నకరికల్లు: మండలంలోని కుంకలగుంట రామాలయంలో ఆంజనేయస్వామి ప్రతిష్ఠా మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వేణు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి పంచామృతస్నపన, విశేష ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. వివిధ రకాల పూలు, పండ్లతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. పలు గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. భక్త సంఘం ఆధ్వర్యంలో ప్రసాదం పంపిణీ చేశారు.

డివిజన్ సర్వే ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా వెంకటరావు



సత్తెనపల్లి(ముప్పాళ్ళ): సత్తెనపల్లి డివిజన్ సర్వే ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఆదివారం జరిగాయి. సంఘం నూతన అధ్యక్షుడిగా పి.వెంకటరావు, కార్యదర్శిగా శ్రీరామ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా షేక్ హసన్, సంయుక్త కార్యదర్శిగా పి.రాజశేఖర్, కోశాధికారిగా సీహెచ్ చాణక్య, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా టి.శ్రీనివాసరావు, షేక్ అఫ్రోజ్ వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసంఘం అధ్యక్షురాలు జి.భాగ్యలక్ష్మి, మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి యాసిన్ బాషా, సీనియర్ మండల సర్వేయర్లు సులేమాన్‌ఖాన్, విజయ్, ఆయా గ్రామాల విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.

స.హ.చట్టాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోండి

నకరికల్లు: రాజ్యాంగాన్ని అందులోని చట్టాలను ప్రతిఒక్కరూ అర్థం చేసుకుని సక్రమమైన మార్గంలో వినియోగించుకోవాలని సమాచార హక్కు చట్టం ప్రచార ఐక్యవేదిక మండల అధ్యక్షుడు ముజావర్ జాన్‌అహ్మద్ ఆదివారం అన్నారు. సమాచారహక్కు చట్టం అమల్లోకి వచ్చిన రోజు పురస్కరించుకొని ప్రతిఒక్కరికీ చట్టాలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రశ్నించడంతో హక్కులను సాధించుకోవచ్చన్నారు. సమాచార హక్కు చట్టం పేదలకు ఆయుధంగా మారాలన్నారు. ప్రజల హక్కులను కాపాడేందుకు ఐక్యవేదికలో స్వచ్ఛందంగా పనిచేస్తున్న స.హ. చట్టం కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా దేవుని సేవకులను గౌరవించే రోజు



సత్తెనపల్లి(ముప్పాళ్ళ): బాగ్స్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చ్ ఆధ్వర్యంలో దేవుని సేవకులను గౌరవించే రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అక్టోబర్ రెండవ ఆదివారం దేవుని సేవకులను గౌరవించే రోజుగా భావిస్తారు. అందులో భాగంగా సంఘ కాపరి రెవరెండ్ జరుగుమల్లి ఇజ్రాయిల్ దంపతులను సంఘ అధ్యక్షుడు గుజ్జర్లపూడి సైకిలాబ్, ఉపాధ్యక్షుడు గుజ్జర్లపూడి చంద్రకాంత్ కార్యవర్గ సభ్యులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ కార్యవర్గ సభ్యులు బంకా కిశోర్‌బాబు, గుజ్జర్లపూడి రవిరాజ్, విశ్వాసులు, దైవ సేవకులు తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

ముప్పాళ్ళ: తాళం వేసి ఉన్న ఇంట్లో చొరబడి బంగారు ఆభరణాలు, నగదు ఎత్తుకెళ్లిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వి.సోమేశ్వరరావు ఆదివారం తెలిపారు. మండలంలోని పలుదేవర్లపాడు గ్రామానికి చెందిన చల్లగుండ్ల శివకుమారి భర్త మరణించడంతో ఒంటరిగా ఉంటుంది. రెండు రోజుల క్రితం ఆమె ఇంటికి తాళం వేసి సత్తెనపల్లి మండలంలోని రెంటపాళ్ళలోని సోదరి వద్దకు వెళ్లింది. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపులు పగలకొట్టి లోపలకు ప్రవేశించి బీరువాలోని 4 సవర్ల బంగారు ఆభరణాలు, 20 గ్రాముల వెండి సాభరణాలు, 7వేల నగదు ఎత్తుకెళ్లారు. శనివారం ఇంటికి వచ్చే సరికి తలుపులు పగలకొట్టి ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండటాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు. శివకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సర్వీసులు పెరగవు.. వేళకు రావు

- ఆర్టీసీ ఉచిత ప్రయాణంతో పెరిగిన మహిళా ప్రయాణికులు
- బస్సుల్లో 100 మందికి పైగా ఎక్కుతున్న ప్రయాణికులు
- సర్వీసులు మాత్రం అవే..
- ఎప్పుడు ఎక్కడ ఆగిపోతాయో తెలియని వైనం
- అవస్థలు పడుతున్న ప్రజలు



అచ్చంపేట నుంచి సత్తెనపల్లి వెళ్లే ఆర్టీసీ బస్సు

అచ్చంపేట: ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ప్రయాణికుల సంఖ్యకు తగ్గట్లు బస్సు సర్వీసులు పెంచడం లేదు. ఉన్నవి సమయపాలన పాటించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో బస్సులు ఆలస్యమైతే ఆటోల్లో ప్రయాణికులు వెళ్లేవారు. ఇప్పుడు బస్సు ప్రయాణం ఉచితం కావడంతో ఎవ్వరూ ఆటోల్లో వెళ్లడంలేదు. బస్సులు ఆలస్యమైనా వేచి ఉంటున్నారు. దీనికి తోడు బస్సులు సకాలంలో రాకపోవడం, గంటకో, రెండు గంటలకో ఒకేసారి మూడు నాలుగు బస్సులు వస్తున్నాయి. ప్రయాణికులు ముందు వచ్చిన బస్సు ఎక్కడానికి తోసుకుంటున్నారు. వయస్సు మీరిన వారు, గర్భిణులు ఆర్టీసీ బస్సులు ఎక్కలేని పరిస్థితులు నెలకొన్నాయి.

సామర్థ్యానికి మించి..

55 మంది సామర్థ్యం ఉన్న బస్సుల్లో 100కు పైగా ప్రయాణికులు ఎక్కుతున్నారు. ఆర్టీసీ బస్సుల్లో 50 నుంచి 60మంది వరకు ప్రయాణించే సామర్థ్యం ఉంది. సీటింగ్ ప్రకారం అయితే ఒక బస్సులో 53మంది మాత్రమే ప్రయాణించాలి. అలాంటిది ఇప్పుడు ఏ బస్సు చూసినా 100మందికి తక్కువ ప్రయాణికులు ఉండటంలేదు. ఇందులో మూడు వంతుల మంది మహిళా ప్రయాణికులే ఉంటున్నారు. దీంతో కండక్టర్లు ప్రతి ప్రయాణికుని వద్దకు వెళ్లి ఆధార్‌కార్డు పరిశీలించి టికెట్ కొట్టడం వల్ల చాలా ఆలస్యమవుతోంది. ఉచిత ప్రయాణమైన ప్రతి ఒక్కరి ఆధార్ కార్డు చూసి టికెట్ కొట్టాలన్నది ప్రభుత్వ నిబంధన. మామూలుగా అయితే అచ్చంపేట నుంచి సత్తెనపల్లికి మధ్యలో ఉన్న 7 గ్రామాల్లో, కొన్ని గ్రామాలలో ఒక రెండు బస్సుస్టాప్‌లున్నా 27 కిలోమీటర్ల దూరానికి 50 నిమిషాలనుంచి గంట పడుతుంది. ఇప్పుడు సుమారు గంటంపావు నుంచి గంటన్నర సేపు పడుతోంది. మధ్య రైలు గేటు పడితే మరో పావుగంట పడుతుంది. దీంతో సకాలంలో ఉద్యోగులు డ్యూటీలకు వెళ్లలేకపోతున్నారు. విద్యార్థులు సత్తెనపల్లిలోని కాలేజీలకు టైముకు వెళ్లలేకపోతున్నారు.

టైం అడగొద్దు.. బస్సు వచ్చినప్పుడు ఎక్కడమే

సకాలంలో బస్సులు ఎందుకు రావడంలేదని ఆర్టీసీ డ్రైవరు, కండక్టరును అడిగితే ఇకపై బస్సు టైములగురించి అడగొద్దు, వచ్చినప్పుడు ఎక్కడమే అంటున్నారు. బస్సు మధ్యలో ఆగినా, చేరాల్సిన టైముకు చేరకపోయినా మాకు ఎలాంటి బాధ్యతలేదని 8 గంటల డ్యూటీ చేయాల్సిన మేము 12 గంటలు చేస్తున్నామని వాపోతున్నారు. మాకు టిఫిన్ చేయడానికి కూడా టైము ఉండటం లేదు, ఒక్కోసారి డ్యూటీ దిగే సరికి ఇంకా ఎక్కువ టైము కూడా పడుతోందని చెబుతున్నారు.

బస్సుల సంఖ్య పెంచాలి



పెరిగిన ప్రయాణికులకు తగినట్లుగా బస్సుల సంఖ్యను పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. బస్సులో ఉచిత ప్రయాణం ఇస్తున్నామని చెప్పుకోవడంతో పాటు ప్రయాణికులు ఎలా ప్రయాణిస్తున్నారు.. ఎన్ని అవస్థలు పడుతున్నారో తెలుసుకోవాలి. ప్రయాణికుల సంఖ్య బాగా పెరిగింది. బస్సులు మాత్రం గతంలో లాగానే ఉన్నాయి. ఒక్కొక్క రోజు ఇంకా తగ్గిస్తున్నారు.

– షేక్ నాగులు, అచ్చంపేట

మాదిపాడుకు సకాలంలో బస్సులు రావడంలేదు

మండలంలోని మాదిపాడు జిల్లాలో చిట్టచివరి గ్రామం. దీని ఆనుకుని కృష్ణానది ఉంది. కృష్ణానది పడవల్లో దాటితే ఒక వైపు జగ్గయ్యపేట, మరో వైపు వేదాద్రి, పెనుగంచిప్రోలు వంటి పుణ్య క్షేత్రాలున్నాయి. మాదిపాడు అడవి మార్గంలో సత్తెమ్మతల్లి దేవాలయం ఉంది. ఇంత ప్రాధాన్యమున్న మాదిపాడుకు గతంలో గంటకో బస్సు వచ్చేది. ఇప్పుడు రెండు గంటలకు ఒకటి కూడా రావడంలేదు. కృష్ణానది మీదుగా పడవలు, బల్లకట్టుద్వారా అవతలి ఒడ్డుకు వెళ్లేందుకు ఎంతో దూరం నుంచి ప్రయాణికులు వచ్చిపోతుంటారు.

– దేవరశెట్టి శ్రీనివాసరావు, మాదిపాడు

చేను దున్నేశారు.. చర్యలు తీసుకోండి

వాట్సాప్ గవర్నెన్స్‌లో ఫిర్యాదు చేసిన మిట్టపాలెం రైతు

అచ్చంపేట: ఆరుగాలం ఇంటిల్లిపాదీ కష్టపడి వేసిన పంటను కొందరు వ్యక్తులు దున్నేశారని మండలంలోని మిట్టపాలెం గ్రామస్తుడు కొట్టె కోటేశ్వరరావు శనివారం వాట్సాప్ గవర్నెన్స్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పెదపాలెం శివారులో సర్వే నంబర్ 169లో తనకు 5.13 సెంట్లు భూమి ఉండగా అందులో మినపపంట సాగుచేస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల 10వ తేదీ కొందరు వ్యక్తులు పంట భూమిని ట్రాక్టరుతో దున్నుతుండగా... విషయం తెలుసుకుని మేము వెళ్లి 'మాచేను ఎందుకు దున్నుతున్నావ్, ఎవరు దున్నమన్నారని' అడిగితే 'నేను బాడుగకు వచ్చాను, పెదపాలెం గ్రామానికి చెందిన బుర్రి కిరణ్, బుర్రి పుల్లయ్య అనే వారు దున్నమన్నారని చెప్పాడు. ఈ భూమి వాళ్లదుకాదు.. మాది.. దున్నొద్దని చెప్పినా వినిపించకోలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. తాము కష్టపడి పంట వేసుకున్న భూమిని ధ్వంసం చేసినవారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కొట్టె కోటేశ్వరరావు కోరారు.

ముగిసిన మహిళా సమ్మేళనం



సత్తెనపల్లి(ముప్పాళ్ళ): మండలంలో నందిగామలోని శ్రీసరస్వతి శిశుమందిర్ పాఠశాలలో సప్తశక్తి –మహిళా సమ్మేళనం ఆదివారంతో ముగిశాయి. భారతదేశంలో మహిళల పాత్ర, కుటుంబ ప్రబోధ, పర్యావరణం, భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు, విలువతో కూడిన విద్యపై నాలుగు రోజుల పాటు సమావేశాలు నిర్వహించినట్లు పాఠశాల ప్రధాన మాతాజీ కె.అంజని తెలిపారు. వక్తలుగా అనురాధ, కౌసల్య వ్యవహరించారు. కార్యక్రమంలో మాతాజీలు సంధ్య, శాంతి, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

పరీక్షల బాటలు





సత్తెనపల్లి రోడు అంబేద్కర్ బొమ్మ సెంటర్‌లో గోతులు

అమరావతి ముఖద్వారం అంబేద్కర్ బొమ్మ సెంటర్‌లో ప్రయాణమంటేనే వాహనచోదకులకు పరీక్షే. ఇక్కడ ఏర్పడిన గోతులతో ప్రజలకు పాట్లు తప్పడం లేదు. సత్తెనపల్లి నుంచి అమరావతికి వచ్చే వాహనాలు, గుంటూరు నుంచి అమరావతికి వచ్చే వాహనాలకు అంబేద్కర్ బొమ్మ వద్ద ఏర్పడిన గుంతల కారణంగా ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఇటీవల గురిసిన వర్షాలకు ఈ గుంతలు మరింతగా విస్తరించాయి. దీంతో భారీ వాహనాల టైర్లు ఇరుక్కుపోయి తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. రాత్రి వేళల్లో దగ్గరకు వచ్చే వరకు గోతులు కనపడకపోవడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ సమస్యపై సీపీఎం మండల కార్యదర్శి సూరిబాబు మాట్లాడుతూ గ్రామంలో అధికలోడుతో భారీవాహనాలు రావడంతో రోడ్డు గుంతలమయమవుతోందని, అధిక లోడు, భారీ వాహనాలను గ్రామం వెలుప ఉన్న రోడ్డుకు మళ్లించాలని అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు.

–అమరావతి

అలవాలలో ఉచిత వైద్య శిబిరం

రొంపిచర్ల: మండలంలోని అలవాల గ్రామంలో వెన్నా బాలకోటిరెడ్డి యూత్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని శాసన సభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, వెన్నా నాగేంద్రమ్మతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు దోమల బెడద ఎక్కువై, ప్రజలు విషజ్వరాల పాలవుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసిన వెన్నా బాలకోటిరెడ్డి యూత్‌ను ఆయన అభినందించారు. ముందుగా గ్రామంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. శిబిరంలో 220 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ శిబిరంలో నరసరావుపేట మ్యాక్స్‌కేర్ సాయి తిరుమల స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ వై.శివప్రదీప్, డాక్టర్ వై.శ్రీహర్ష, డాక్టర్ శంకర్ మోటుమర్రి, సిబ్బంది పాల్గొని సేవలు అందించారు. వైద్యులను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ నీటి సంఘ ప్రెసిడెంట్ వెన్నా రవీంద్రారెడ్డి, రొంపిచర్ల మండల టీడీపీ అధ్యక్షుడు పల్లెల నాగిరెడ్డి, పులుకూరి జగ్గయ్య, గాడిపర్తి సురేష్, ఇంటూరి సురేష్, మాజీ ఎంపీపీ మొండితోక రామారావు, వడ్లమూడి కిషోర్, రంగిశెట్టి రామకృష్ణ, కె.సంజీవరావు, షేక్ బాషా, కంచెర్ల చిన్న, యలమంద, వెన్నా వేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

బొల్లాపల్లి: వివాహితుడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని రేమిడిచర్ల గ్రామ సుగాలీ తండాలో చోటు చేసుకుంది. బండ్లమోటు ఎస్సై ఎ.బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మేకల దిన్నె తండాకు చెందిన బాణావతు శంకర్‌నాయక్ (33) పురుగు మందు తాగి మృతి చెందాడు. పదేళ్ల క్రితం శంకర్ నాయక్‌కు రేమిడిచర్లకు చెందిన స్వాతి బాయికి వివాహం కాగా పలుమార్లు కాపురంలో కలతలు రావడంతో స్వాతి బాయి ఇటీవల స్వగ్రామంలో ఉంటుంది. భార్య దగ్గరకు వచ్చి వెళ్తున్న శంకర్ నాయక్ శనివారం సాయంత్రం రేమిడిచర్లలో ఆమె ఇంటి వద్ద పురుగు మందు తాగాడు. చికిత్స కోసం 108లో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు మృతి చెందాడు. మృతుడి అన్న శివానాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి ఇరువురు సంతానం . మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. శంకర్ నాయక్ మృతి అనుమానాస్పదంగా ఉందని మృతుని కుటుంబ సభ్యులతో పాటు తండావాసులు బండ్లమోటు పోలీస్ స్టేషన్ వద్ద న్యాయం చేయాలని కొంత సమయం ఆందోళన చేశారు. భార్యతో పాటు మరొకరు కొట్టి బలవంతంగా ఆత్మహత్యకు పురిగొల్పారని, దీనిపై విచారణ చేసి న్యాయం చేయాలని మృతుని కుటుంబ సభ్యులు వాపోతున్నారు.

ముగిసిన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీలు



సుగాలీ కాలనీ హైస్కూల్‌లో నిర్వాహకులను సన్మానిస్తున్న రామస్వామి తదితరులు

సత్తెనపల్లి(ముప్పాళ్ళ): పట్టణంలో సుగాలీ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పల్నాడు జిల్లా స్థాయి నరేష్ మెమోరియల్ ఫుట్‌బాల్ పోటీలు ఆదివారం ముగిశాయి. పోటీల్లో 12 జట్లు పాల్గొన్నాయి. నరేష్ ఫుట్‌బాల్ క్లబ్ జట్టు మొదటి బహుమతి సాధించగా, మధు ఫుట్‌బాల్ క్లబ్ ద్వితీయస్థానంలో, విజయవాడ బ్లూస్ ఫుట్‌బాల్ క్లబ్ తృతీయస్థానంలో నిలిచినట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ షేక్ మహమ్మద్ రియాజ్ తెలిపారు. విజేతలకు మాజీ మున్సిపల్ చైర్మన్ యెలినేడి రామస్వామి, పల్నాడు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు కె.సుబ్రహ్మణ్యేశ్వరరావు, కోరమండల్ ఫెర్టిలైజర్స్ ఇంటర్నేషనల్ జనరల్ మేనేజర్ ఎం.సచ్చిదానందరెడ్డి, వెంకటేష్, ఎం.మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

ఎలా అనుమతిచ్చారో!

- జాతీయ రహదారిని ఆనుకుని బాణసంచా విక్రయకేంద్రాలు
- చుట్టూ జనావాసాలు
- ఆగ్రహం వ్యక్తంచేస్తున్న కొండమోడు గ్రామస్తులు



కొండమోడులో జాతీయ రహదారికి ఆనుకుని కనకదుర్గ క్రాకర్స్ గోదాము, విక్రయకేంద్రం



జాతీయ రహదారికి అనుకుని ఉన్న త్రికోటేశ్వర క్రాకర్స్ గోదాము, విక్రయకేంద్రం

రాజుపాలెం: జనావాసాల మధ్య, జాతీయ రహదారి పక్కనే బాణసంచా గోదాము , విక్రయాలకు అధికారులు ఎలా అనుమతి ఇచ్చారని ప్రజలు మండిపడుతున్నారు. మండలంలోని కొండమోడు జంక్షన్ సమీపంలో గతేడాది కనకదుర్గా క్రాకర్స్ గోదాముతో పాటు విక్రయకేంద్రం, త్రికోటేశ్వర క్రాకర్స్ దీపావళి క్రాకర్స్ గోదాముతోపాటు విక్రయ కేంద్రాలకు అధికారులు అనుమతిచ్చారు. వీటిని నాటి నుంచి పర్మినెంట్‌గా నడుపుతూనే ఉన్నారు. క్రాకర్స్ విక్రయకేంద్రాల చుట్టుపక్కల డిగ్రీ కాలేజీ, ఎదురుగా రెసిడెన్సీ, కల్యాణమండపంతోపాటు చిరు వ్యాపారస్తులు షాపులు నిర్వహిస్తున్నారు. జాతీయ రహదారి పక్కనే, జనావాసాల మధ్య ఎలా అనుమతులు ఇచ్చారని కొండమోడు ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, పంచాయతీరాజ్ శాఖ అనుమతులతో గుర్తించిన ప్రదేశాల్లో బాణసంచా విక్రయ కేంద్రాలు నిర్వహించాలి. వీటికి విరుద్ధంగా ఈ రెండు బాణసంచా విక్రయకేంద్రాలు నడుపుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ రెండు బాణసంచా విక్రయకేంద్రాలను తీసివేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

తనిఖీలు చేస్తాం: సరోజ, తహసీల్దార్, రాజుపాలెం

కొండమోడు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన రెండు బాణసంచా విక్రయ కేంద్రాలను డివిజన్ స్థాయి అధికారులు రెండు, మూడు రోజుల్లో తనిఖీలు చేస్తారు. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే తగిన చర్యలు తీసుకుంటాం.

నవంబర్ 9న రెడ్డి కార్తిక వన సమారాధన



సమావేశంలో శ్రీ యోగి వేమారెడ్డి సేవా సమితి నాయకులు

వినుకొండ: శ్రీ యోగి వేమారెడ్డి సేవా సమితి వినుకొండ ఆధ్వర్యంలో నవంబరు 9న కార్తిక వన సమారాధన, ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కాలర్‌షిప్ కార్యక్రమం స్థానిక వెల్లటూరు రోడ్డులోని రెడ్డి సంఘం బిల్డింగ్‌లో నిర్వహిస్తున్నట్లు సేవా సమితి నాయకులు తెలిపారు. స్థానిక రెడ్డి సంఘం బిల్డింగ్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో యోగి వేమారెడ్డి సేవా సమితి నాయకులు మాట్లాడుతూ అర్హత ఉన్న రెడ్డి సామాజిక విద్యార్థులు ఈ నెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తులు గుడ్‌షెపర్డ్ స్కూల్, గీతమ్స్ స్కూల్‌లో ఉంటాయని తెలిపారు. వన భోజనాలకు బస్టాండ్ వద్ద నుంచి బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని, డెంటల్ మెడికల్ క్యాంప్, రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు వివరించారు. రెడ్డి సోదర సోదరీమణులు వన భోజనాల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సేవా సమితి ప్రెసిడెంట్ ఆరె శివారెడ్డి, పెద్దిరెడ్డి సుధాకరరెడ్డి, యారం రామిరెడ్డి, వినుకొండ ఎంపీపీ వెంకటరామిరెడ్డి, నూజెండ్ల ఎంపీపీ జయరామిరెడ్డి, మూలె బాల చెన్నారెడ్డి, కొత్త కృష్ణారెడ్డి, జక్కిరెడ్డి సుబ్బారెడ్డి, భాస్కరరెడ్డి, సుందరరెడ్డి, తుమ్మా రామకృష్ణారెడ్డి, లేళ్ల అంజిరెడ్డి, పప్పిరెడ్డి, రాజారెడ్డి, కొండారెడ్డి, శ్రీనివాసరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, వెంకటరమణారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, దశరథ రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గవాయిపై దాడి ప్రజాస్వామ్యానికి ముప్పు

రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాల నాయకులు



మాట్లాడుతున్న గిరిజన సంఘు రాష్ట్ర నాయకుడు కోటానాయక్




మాట్లాడుతున్న మాల ఆర్గనైజేషన్ రాష్ట్ర సెక్రటరీ పిల్లి రాజు

నరసరావుపేట: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయిపై దాడి దేశ ప్రజాస్వామ్యంపై దాడిగా ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. ఆదివారం గవాయిపై దాడిని నిరసిస్తూ కోటప్పకొండ రోడ్డులోని సీపీఎం కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ పాలన ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో నడుస్తుందన్నారు. దేశ ప్రజలపై ఆర్ఎస్ఎస్ దాడులకు పాల్పడుతుందని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాలరాసి మనుధర్మాన్ని రాజ్యాంగంగా అమలు చేయాలని చూస్తోందన్నారు. మతాన్ని అడ్డుపెట్టుకొని అధికారాన్ని సుస్థిరం చేసుకుని కార్పొరేట్ సంస్థలకు దేశ సంపదను దోచిపెడుతూ ప్రజలపై పన్నుల భారం మోపి దోపిడీ కొనసాగిస్తుందని అన్నారు. అందులో భాగంగానే ప్రజాస్వామ్య బద్ధంగా మాట్లాడుతున్న జస్టిస్ గవాయి లాంటి మేధావులపై దాడులకు పాల్పడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ పాల్పడుతున్న ఈ దాడులకు వ్యతిరేకంగా దేశ ప్రజలంతా ఐక్యమై మరో స్వాతంత్ర్య పోరాటం కొనసాగించాల్సిన అవసరం ఉందని ప్రజలకు పిలుపునిచ్చారు. గిరిజన సంఘం రాష్ట్ర నాయకుడు వి.కోటానాయక్, పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, కేఎన్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.కృష్ణ, ఎమ్మార్పీఎస్ నాయకులు రెడ్డిపోయిన ప్రసన్నకుమార్, ప్రజా కళా మండలి రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఉన్న రాణి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు నాయక్, రిటైర్డ్ హెడ్‌మాస్టర్ కట్ట కోటేశ్వరరావు, సీఎల్పీ నాయకులు వినుకొండ పేరయ్య, బోసు పాల్గొన్నారు.

సీజేఐ గవాయ్‌పై దాడి అమానుషం

విజయపురిసౌత్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడి దేశంలో ఉండే దళితులందరిపై జరిగిన దాడిగా భావిస్తున్నామని విజయపురిసౌత్ మాల సంఘ అధ్యక్షుడు బొబ్బిలి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం విజయపురిసౌత్‌లోని అంబేడ్కర్ సెంటర్‌లో బొబ్బిలి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా హాజరైన మాల ఆర్గనైజేషన్ రాష్ట్ర సెక్రటరీ పిల్లి రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈ దాడిని సీరియస్‌గా తీసుకోవాలని, పోలీసు శాఖ సుమోటోగా కేసు నమోదు చేసి బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. భారత ప్రధాన న్యాయమూర్తి సీజేఐ గవాయ్‌పై దాడి అమానుషమని, ఇది ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని, ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థపై జరిగిన దాడి అని, న్యాయవ్యవస్థ గౌరవం కాపాడడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అధ్యక్షుడు జాన్ ముత్తయ్య, నరసరావుపేట నియోజకవర్గ ప్రెసిడెంట్ త్రికోటేశ్వరరావు, మాచర్ల నియోజకవర్గ అధ్యక్షుడు దాసి మల్లికార్జునరావు, పిల్లి రాజబాబు, సీహెచ్ శ్రీనివాసరావు, పత్తి రామచంద్రరావు, నరసింహ మూర్తి, మీసాల వెంకటేశ్వర్లు, బండి నాగేశ్వరరావు, పురాణం శ్రీను, రాఘవ, రామకృష్ణ, కట్టా రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దత్తాత్రేయుని విగ్రహం, ధ్వజస్తంభం ప్రతిష్ఠ



ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠ చేస్తున్న భక్తులు

కారెంపూడి: మండలంలోని ఒప్పిచర్ల గ్రామ శివారు నల్లమల అటవీ ప్రాంతంలో స్వయంభువుగా వెలసిన ధన మల్లేశ్వరస్వామి (ధన మల్లయ్య) ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ.. అలాగే ఆలయ ప్రాంగణంలో దత్తాత్రేయుని విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. ఒప్పిచర్ల గ్రామస్తులతో పాటు వేలాదిగా భక్తులు ఈ ఉత్సవంలో పాల్గొన్నారు. కొండ మీదకు యంత్రాలు పోలేని పరిస్థితిలో భక్తులే స్వయంగా ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. వేదానుసారం వారం రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ధ్వజస్తంభాన్ని, దత్తాత్రేయుని విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ వారు దాతల సహకారంతో నిర్వహించారు.